సాక్షి అనకాపల్లి

గురువారం । 29 । మే । 2025



దంచికొట్టిన వాన 8లో

బుధవారంనాటి భారీ వర్షాలతో వడ్డాది డైవర్షన్ రోడ్డు మునిగింది. బుచ్చయ్యపేట మండలంలో 5 సెం.మీ. వర్షపాతం నమోదైంది.



పుస్తక ప్రదర్శన

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



ఆటో బోల్తా పడి.. 8లో

కశింకోట–పెదపాడు రోడ్డులో బుధవారం ఓ ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో 12 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

తీరని భూ దాహం

- బల్క్‌డ్రగ్ పార్క్ కోసం అదనపు భూ సేకరణ
- పెదతీనార్లలో 518, సీహెచ్‌ఎల్ పురంలో 198 ఎకరాలు
- రైతులతో అధికారుల మంతనాలు
- నేరుగా కొనుగోలుకు యత్నాలు
- ఎకరాకు రూ.37 లక్షలు ఇస్తామని బేరాలు
- ససేమిరా అంటున్న రైతులు



పెదతీనార్ల, సీహెచ్‌ఎల్ పురం గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ సేకరించనున్న భూములు



తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో బేరసారాలు సాగిస్తున్న ఏపీఐఐసీ అధికారులు

నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వానికి భూదాహం తీరడం లేదు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం అదనపు భూసేకరణ చేస్తోంది. పోనీ పరిహారం విషయంలో న్యాయం చేస్తోందా అంటే అదీ లేదు. నోటిఫికేషన్ లేకుండా నేరుగా రైతుల వద్ద నుంచే కొని వారి నోట్లో మట్టి కొట్టేందుకు కుయుక్తులు పన్నుతోంది. బుధవారం ఏపీఐఐసీ అధికారులు నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసేకరణ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి వెల్లడైంది. తక్కువ భూమి సేకరించే గ్రామాల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తూ, ఎక్కువ భూములు అవసరమైన చోట నేరుగా రైతుల నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. డైరెక్ట్ పర్చేజ్ అయితే రైతులకు నష్టపరిహారం తప్ప ఇతర ప్యాకేజీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. బల్క్‌డ్రగ్ పార్క్ విస్తరణ కోసం సీహెచ్‌ఎల్ పురం రెవెన్యూ పరిధిలో 198 ఎకరాలు, పెదతీనార్ల రెవెన్యూ పరిధిలో 518 ఎకరాలు భూములు కావాల్సి ఉంది. తక్కువ భూమి ఉన్న సీహెచ్‌ఎల్ పురంలో భూసేకరణ కోసం తాజాగా 4 (1) నోటిఫికేషన్ విడుదల చేశారు. 500 ఎకరాలు దాటి అవసరమున్న పెదతీనార్లలో మాత్రం నోటిఫికేషన్ విడుదల చేయకుండా నేరుగా కొనుగోళ్ల పేరుతో రైతులతో మంతనాలు జరుపుతున్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం సరిపడా భూములను గత ప్రభుత్వం కేటాయించింది. కూటమి ప్రభుత్వం పార్క్ విస్తరణ పేరుతో అదనంగా భూములు సేకరించడం పట్ల ఆయా గ్రామాల రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఏపీఐఐసీ ద్వారా మండలంలో వేంపాడు, చందనాడ, అమలాపురం, డీఎల్ పురం, రాజయ్యపేటల్లో ప్రభుత్వం 4500 ఎకరాలు సేకరించిన విషయం తెలిసిందే. వీటిలో గత ప్రభుత్వం 2 వేల ఎకరాలు బల్క్‌డ్రగ్ పార్క్‌కు కేటాయించింది. మిగిలిన భూములను కూటమి ప్రభు త్వం తాజాగా తెర మీదకు వచ్చిన ఆర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్‌కు ఆగమేఘాల మీద కట్టబెట్టింది.

రైతుల నుంచి వ్యతిరేకత

బల్క్‌డ్రగ్ పార్క్‌కు సరిపడ భూములు కేటాయించినప్పటికీ పార్క్ విస్తరణ పేరుతో జానకయ్యపేట, సీహెచ్‌ఎల్ పురం, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక గ్రామాల్లో మరో వెయ్యి ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. బల్క్‌డ్రగ్ పార్క్‌లో చిన్న చిన్న యూనిట్లు స్థాపించే పారిశ్రామికవేత్తల కోసమే తమ నుంచి అదనంగా భూములు సేకరిస్తున్నారంటూ రైతులు మండిపడుతున్నారు. తాజాగా బుధవారం పెదతీనార్ల గ్రామస్తులతో ఏపీఐఐసీ ఎస్‌డీసీ అనిత సమావేశం నిర్వహించారు. ఈ గ్రామంలో 518 ఎకరాల భూమి అవసరమవుతోందని, బల్క్‌డ్రగ్ పార్క్ కోసం అదనంగా సేకరిస్తున్నామని, నేరుగా కొనుగోళ్ల పేరుతో భూములు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ గ్రామాల్లో మార్కెట్ విలువ ఎకరా రూ.15 లక్షలు ఉందని, దానిని రెట్టింపు చేసి, ఫలసాయంతో కలిపి ఎకరాకు రూ.37 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని, భూములు ఇవ్వాలని కోరారు. పెదతీనార్లలో 20 నుంచి 50 ఎకరాల భూములు కలిగిన భూస్వాములు ఎకరాకు రూ.60 లక్షలు చెల్లిస్తే భూములు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. దీనిపై వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి కొంతమంది రైతులతో కలసి అభ్యంతరం వ్యక్తం చేశారు. వీరు మాట్లాడుతూ పెద్ద రైతులను దృష్టిలో పెట్టుకుని భూముల ధర నిర్ణయించడానికి వీల్లేదన్నారు. ఈ భూములపై ఆధారపడి జీవించే వారికి 2013 భూసేకరణ చట్టప్రకారం నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, మేజర్లకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఏర్పాటయిన రసాయన పరిశ్రమల వల్ల ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, బల్క్ డ్రగ్ పార్క్ విస్తరణ కోసం అయితే భూములు ఇచ్చే ప్రసక్తి లేదన్నారు. జానకయ్యపేట, చినతీనార్లలో రైతులు కూడా బల్క్‌డ్రగ్ పార్క్ విస్తరణ కోసం అయితే భూములు ఇవ్వమంటూ నిరసన తెలియజేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో భూములు ఇవ్వాల్సి వస్తే 4 (1) నోటిఫికేషన్ విడుదల చేసి 2013 భూసేకరణ చట్టప్రకారం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ భూములపై ఆధారపడ్డ ఇతర వృత్తుల వారికి కూడా న్యాయం చేయాలన్నారు.

ప్రజల గోడు ఇంతేనా?

రీ-సర్వే సవరణకు ముప్పతిప్పలు

- మూడుసార్లు దరఖాస్తు చేసిన రైతు
- 7 నెలలు దాటినా లభించని పరిష్కారం





తనకు న్యాయం చేయాలని కోరుతూ అప్పారావు కలెక్టరేట్‌లో పెట్టిన అర్జీ రశీదు, (ఇన్‌సెట్) అప్పారావు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)ను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నా సామాన్యుల సమస్యలు తీరడం లేదు. ఈ వ్యవస్థ మొక్కుబడిగా నడుస్తోందని, తమలాంటి వారికి న్యాయం జరగడం లేదని మునగపాకకు చెందిన రైతు పీలా అప్పారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన 'సాక్షి'కి తెలిపారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో గత ఏడాది అక్టోబర్ 19న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో అప్పారావు రీ-సర్వేలో జరిగిన తప్పును సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. మూడు నెలల్లోగా సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆరోజున చెప్పారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో అప్పారావు ఫిబ్రవరిలో రెవెన్యూ అధికారులను మరోసారి కలిసి తనకు న్యాయం జరగలేదని వారి దృష్టికి తీసుకువచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో ఈనెల 19న కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో మరోసారి దరఖాస్తు చేశారు. అనంతరం వీఆర్వోను కలిసి తన ఫిర్యాదు గురించి వివరించారు. ప్రస్తుతం యాప్ ఓపెన్ కావడంలేదని వీఆర్వో చెబుతున్నారని, గత అక్టోబర్‌లో యాప్ పనిచేసిన సమయంలో తన సమస్యను పరిష్కరించి ఉంటే తన సమస్య తీరేదని అప్పారావు వాపోతున్నారు. రీ-సర్వే సవరణ కోసం తాను దరఖాస్తు చేసుకుంటే పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారే గాని సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారే గాని పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి తనకు తగు న్యాయం జరిగేలా చూడాలని అప్పారావు కోరుతున్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కృష్ణారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కృష్ణారావు

అనకాపల్లి: ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.కృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి జిల్లా డీసీహెచ్‌ఎస్‌గా, పాడేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, ఫిబ్రవరి 21న అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి ఈఎన్‌టీ సర్జన్‌గా బదిలీపై వచ్చారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆదేశాల మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. గత సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ కె.కృష్ణారావుకు ఆస్పత్రి వైద్యులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

న్యూస్‌రీల్

ఏఎంసీకి వ్యాపారవేత్త గుప్తా పార్థివ దేహం



ఆంధ్రా మెడికల్ కాలేజీకి గుప్తా పార్థివ దేహాన్ని అందజేస్తున్న కుటుంబ సభ్యులు



గుప్తా (ఫైల్)

అనకాపల్లి: స్థానిక ఉప్పవారివీధికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, పుష్కల గ్యాస్ కంపెనీ యజమాని కె.ఎల్.ఎన్.గుప్తా (85) మంగళవారం రాత్రి అనారోగ్య కారణంగా తన స్వగృహంలో మృతి చెందారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుప్తా పార్థివ దేహాన్ని విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ (ఏఎంసీ)కి అందజేశారు. మృతుడి భార్య కె.అచ్యుతాంబ, మేనల్లుళ్లు విజయ్‌బాబు, కిరణ్ అనాటమీ హెచ్‌వోడీ డాక్టర్ రవీంద్ర కిషోర్‌కు గుప్తా మృతదేహాన్ని పరిశోధనల నిమిత్తం దానం చేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సును అడ్డుకున్న ఆర్టీసీ డీఎం



ప్రైవేటు బస్సును ఆపి ప్రశ్నిస్తున్న డీఎం ధీరజ్, సిబ్బంది

నర్సీపట్నం: టూరిస్ట్ పర్మిట్‌తో స్టేజ్ గ్యారేజ్ సర్వీసు చేస్తున్న ప్రైవేటు బస్సును ఆర్టీసీ అధికారులు అడ్డుకున్నారు. ప్రతి రోజు సాయంత్రం బయలుదేరుతున్న నర్సీపట్నం–హైదరాబాద్ బస్సును బుధవారం ఆర్టీసీ డీఎం ధీరజ్, సిబ్బంది నిలిపివేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ తీసుకుని స్టేజ్ క్యారేజ్ సర్వీసు చేస్తున్నారన్నారు. అదే విధంగా ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ నిర్వహిస్తున్నారన్నారు. టూరిస్ట్ పర్మిట్ బస్సును స్టేజ్ క్యారేజ్ సర్వీసుగా తిప్పకూడదన్నారు. అందుకే అడ్డుకున్నామన్నారు. ఇకపై స్టేజ్ క్యారేజ్ తిప్పమని హామీ ఇవ్వడంతో వదిలిపెట్టామని డీఎం తెలిపారు.

వ్యక్తిని రక్షించి.. యువకుడు మృతి

- రేవుపోలవరంలో విషాదం



మదీనా వలి (ఫైల్)

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో సముద్రంలో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడబోయే ప్రయత్నంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ విభీషణరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన షేక్ ఇషాక్ మదీనా వలీ (20), షేక్ అలీషాలు అదేగ్రామానికి చెందిన షేక్ అహ్మదుల్లా ప్రీవెడ్డింగ్ ఫొటో షూట్ కోసం బుధవారం రేవుపోలవరం తీరానికి వచ్చారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి సముద్రంలోకి కొట్టుకుపోతున్నట్టు గమనించారు. ఒడ్డున ఉన్న మహిళ బిగ్గరగా అరవడంతో విన్న ఇషాక్ మదీనా వలీ, అలీషాలు సముద్రంలోకి వెళ్లి ఆ వ్యక్తిని రక్షించారు. ఇంతలో రాకాసి అలలు పోటెత్తడంతో ఇషాక్‌మదీనావలీ కొట్టుకుపోయాడు.వెంటనే స్థానిక మత్స్యకారులు బయటకు తీసినప్పటికీ ప్రాణాలు నిలువలేదు. మృతదేహాన్ని నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఏషియన్ కరాటే చాంపియన్ అంజనా శ్రీవేణి



పాయకరావుపేట: పట్టణానికి చెందిన విద్యార్థిని ధూళి అంజనా శ్రీవేణి కరాటేలో దుమ్ము రేపింది. శ్రీలంక రాజధాని కొలంబోలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించిన 9వ ఏషియన్ గోజుర్యు కరాటే చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున పాల్గొని సిల్వర్ మెడల్ సాధించింది. ఈ అంతర్జాతీయ పోటీలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కజికిస్తాన్, ఫిలిప్పీన్స్, మలేషియా, నేపాల్, ఇండోనేషియా వంటి పలు ఆసియా దేశాల నుంచి సుమారు వెయ్యిమంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అండర్–12 కేటగిరీలో పోటీ పడిన అంజనా శ్రీవేణి, తన అద్భుతమైన ప్రదర్శనతో సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకుని దేశానికి, రాష్ట్రానికి, పాయకరావుపేటకు గర్వకారణంగా నిలిచింది. పోటీ ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో కోయంబత్తూరు విమానాశ్రయంలో ఆమెను తమిళనాడు కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ షీహాన్ ప్రమోష్ స్వయంగా కలిసి ఘనంగా సత్కరించారు.

విపత్తుల నివారణపై ప్రత్యేక చర్యలు



విపత్తుల సమయంలో ఉపయోగించే పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతమైన ప్రతిస్పందన ద్వారా ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్నామని, విపత్తుల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం జిల్లాలో పోలీస్‌శాఖ అధికారులతో విపత్తులపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, గ్యాస్ లీకేజీలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలు సంభవించిన సమయంలో దగ్గరలో ఉన్న పోలీస్ సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. విపత్తులు సంభవించిన సమయంలో పోలీసు అధికారులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ) ప్రకారం సమన్వయంతో స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల తీవ్రత ఆధారంగా విధులు కేటాయిస్తూ క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ సహకారంతో అచ్యుతాపురం, పరవాడలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. విపత్తులను ఎదుర్కోడానికి అగ్నిమాపక శాఖ, వైద్య బృందాలు, ఎస్‌డీఆర్‌ఎఫ్/ఎన్‌డీఆర్‌ఎఫ్, స్థానిక పోలీసులు సమష్టిగా కృషిచేయాలన్నారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాస్యూటికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సహకారంతో సీఎస్‌ఆర్ నిధులతో పోలీసులకు అత్యాధునిక ఫైర్ సేఫ్టీ పరికరాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, ట్రైనీ డీఎస్పీ ఎం.వి.కె.చైతన్య, సీఐలు పాల్గొన్నారు.

వాస్తవాలు చెప్పే దమ్ము లేదా?

- మహానాడు వేదికపై అన్నీ అబద్ధాలే..
- ఏడాదిలో గిరిజన సంక్షేమానికి ఒక్క పనైనా చేశారా?
- కిడారి తదితర నేతల ప్రసంగాలపై నిలదీసిన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మహారాణిపేట (విశాఖ): టీడీపీ మంత్రుల దగ్గర నుంచి కార్పొరేషన్ చైర్మన్ల వరకు గిరిజనం గురించి అవాస్తవాలు చెబుతున్నారని, అవగాహనలేమితో మాట్లాడుతున్నారా.. లేదా నిజం చెబితే ప్రజలు ఛీకొడతారని ముందే గ్రహించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారా అని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రశ్నించారు. మహానాడు వేదికగా జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ చిల్లర మాటలు మాట్లాడారని ఆమె మండిపడ్డారు. విశాఖలోని జెడ్పీ బంగ్లాలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న గిరిజనుల కోసం ఏడాది కాలంలో ఒక్క సంక్షేమ పథకమైనా ప్రత్యేకంగా అమలు చేశారా.. అని ఆమె నిలదీశారు. సూపర్ సిక్స్ వాగ్దానాలను అటకెక్కించారని, కనీసం గిరిజన రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి అయినా వేశారా? అని ఆమె ప్రశ్నించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ప్రతి గిరిజనుడికి సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలు అందిన విషయం నిజమా కాదా? అని ఆమె అన్నారు.

బాక్సైట్ జీవోను తెచ్చింది చంద్రబాబు కాదా?

గిరిజన ప్రాంతంలో ఉన్న సంపదను దోచుకోవడానికి చంద్రబాబు నాయుడు ఆనాడు జిందాల్ కంపెనీతో ఒప్పందం చేసుకొని బాక్సైట్ జీవోను తీసుకొచ్చిన విషయం నిజమా? కాదా? అని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంపై జీసీసీ చైర్మన్, ఇతర నాయకులకు అవగాహన ఉందా? లేదా? అని నిలదీశారు. బాక్సైట్ తవ్వకాలపై తీసుకొచ్చిన 97 జీవోను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసిన విషయాన్ని ఎందుకు మరిచిపోయారని నిలదీశారు. కాల్‌సైట్, బాక్సైట్, లేటరైట్ గనులను అక్రమంగా తవ్వి సంపాదన సృష్టించుకోవాలని ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు అధికారం చలాయించే విధానాన్ని రద్దు చేసింది మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వం గిరిజనతరులకు కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇస్తే.. ఆ విధానాన్ని రద్దు చేసి స్థానిక సంస్థల్లో వంద శాతంగిరిజనులే పోటీ చేసే విధానాన్ని వైఎస్ జగన్ తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గిరిజనులకు మేలు చేయడం అంటే ఇది కదా అని ఆమె పేర్కొన్నారు. గిరిజన శాఖ మంత్రి మాట్లాడుతూ గిరిజనులకు ఈ డీఎస్సీలో 2000 పోస్టులు ఇస్తున్నట్లు చెప్పారని, కానీ కేవలం 1023 పోస్టులు మాత్రమే కేటాయించి, ఎందుకలా తప్పుదారి పట్టిస్తున్నారని నిలదీశారు.

వైఎస్ జగన్ హయాంలో గిరిజనులకు మహర్దశ

డోలి మోతల గురించి గొప్పలు చెప్పుకోవద్దని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డోలి మోతల నివారణ కోసం ప్రత్యేకంగా కనెక్ట్ పాడేరు పేరుతో ఒక ప్రాజెక్టును అమలు చేశారన్నారు. పాడేరు డివిజన్లో 1300కు పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని గుర్తించి వాటి నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకొని, అన్నీ సిద్ధం చేస్తే ఈరోజు కూటమి ప్రభుత్వం వచ్చి తామేదో చేస్తున్నట్లుగా బిల్డప్ ఇస్తోందన్నారు. గిరిజన ప్రాంతంలో వైద్య సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేలా పాడేరులో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన మహనీయుడు ఎవరో చెప్పాలని, ఇటువంటి గొప్ప కార్యక్రమం చంద్రబాబునాయుడు తన 40 ఏళ్ల కాలంలో ఎప్పుడైనా గిరిజనుల కోసం చేశారా? అని సుభద్ర నిలదీశారు.

ఈ గోపాలుడి లీలలు వేరయా..

నకిలీ ఏసీబీ సీఐ వెనుక ఓ సంస్థ చైర్మన్

- ఇద్దరూ కలిసి విమానాల్లో యాత్రలు
- హనీట్రాప్ ద్వారా భారీగా వసూళ్లు
- పలువురు అధికారులకూ బెదిరింపులు
- పోలీసులతో కలిసి విందు వినోదాలు





సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీఐ పేరుతో బెదిరిస్తూ వసూళ్లకు దిగి ఊచలు లెక్కిస్తున్న సుధాకర్‌కు తెలుగుదేశం నేత, ఓ సంస్థ చైర్మన్‌తో సత్సంబంధాలు కలిగి ఉండటం చర్చనీయాంశమవుతోంది. ఇద్దరూ కలిసి విమానాల్లో పలుమార్లు గోవా, బ్యాంకాక్ లాంటి ట్రిప్పులకు వెళ్లినట్టు కూడా తెలుస్తోంది. తాను ఏసీబీ సీఐ అని పరిచయం చేసుకుంటూ.. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.5 లక్షలు డిమాండ్ చేసిన వ్యవహారంలో టీడీపీ నేత బలగ సుధాకర్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ కూడా ఊచలు లెక్కబెడుతున్నారు. అయితే, అసలు మొత్తం వ్యవహారంలో చక్రం తిప్పిన గోపాలుడు మరొకరు ఉన్నట్టు తెలుస్తోంది. సదరు వ్యక్తి ఓ ప్రభుత్వ సంస్థ చైర్మన్ హోదాలో అధికారం చెలాయిస్తున్నట్టు సమాచారం. నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్‌తో సదరు చైర్మన్ ఎంతో అన్యోన్యంగా గోవా, బ్యాంకాక్ వంటి ట్రిప్పులకు వెళుతూ విమానాశ్రయాల్లో దిగిన ఫొటోలు తెలుగుదేశం పార్టీ అంతర్గత గ్రూపుల్లోనూ సర్క్యులేట్ అవుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు సదరు సుధాకర్‌కు పలువురు పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతోనూ పరిచయాలు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నగర శివారులోని రిసార్టుల్లో పలువురితో ఉన్న ఫొటోలు కూడా ఇప్పుడు ప్రచారంలోకి వచ్చాయి. అంతే కాకుండా అందమైన అమ్మాయిల ద్వారా పలువురు నేతలు, అధికారులతో అన్యోన్యంగా మాట్లాడిన ఆడియోలు, వీడియోలు రికార్డు చేసి హనీట్రాప్ ద్వారా లక్షలు గుంజినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో లోతుగా విచారణ చేస్తే సదరు చైర్మన్‌తో పాటు ఇతర వ్యక్తుల పాత్ర కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది.

అన్ని శాఖల్లోనూ వసూళ్లు

నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్.. అధికార పార్టీకి చెందిన నేత, ఇతర పోలీసుల అండదండలు చూసుకుని రెచ్చిపోయినట్టు తెలుస్తోంది. సబ్ రిజిస్ట్రార్లు, రవాణాశాఖ, రెవెన్యూ, విద్యుత్ శాఖతో పాటు రాజకీయ పార్టీల నేతలనూ బెదిరించి భారీగా వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. ఏసీబీ పేరుతో పలువురు అధికారుల నుంచి లక్షల్లో గుంజుకున్నట్టు సమాచారం. వీరెవ్వరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకు మాత్రం రావడం లేదు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే తమ మీద కూడా కేసు నమోదవుతుందనే భయమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు. ప్రధానంగా పలువురు సబ్ రిజిస్ట్రార్ల వద్ద లక్షల్లో వసూలు చేశారని తెలుస్తోంది. ఇక రెవెన్యూ శాఖలో కూడా భూలావాదేవీల్లో దండుకుంటున్న అధికారులను గుర్తించి టార్గెట్లు ఇచ్చి మరీ వసూలు చేశారనే ప్రచారం ఉంది. ఇక రవాణా శాఖలో కూడా కొద్ది మంది వద్ద లక్షల్లో వసూలు చేశారని సమాచారం. ఇక కొద్ది మంది నేతలు, అధికారులతో తమ బ్యాచ్‌లో ఉన్న మహిళల ద్వారా చనువుగా మాట్లాడించి.. ఆ మాటలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేసి వసూళ్లకు తెగబడ్డారనే పేరుంది. ఒక విధంగా హనీట్రాప్‌కు పాల్పడ్డారని టీడీపీ నేతలే పేర్కొంటున్నారు. ఈ విధంగా భారీగా దండుకున్న సొమ్ముతో సదరు బ్యాచ్ జల్సాలు చేసేవారు. ప్రధానంగా గోవా, బ్యాంకాక్ వంటి ట్రిప్పులకు వెళ్లినట్టు తెలుస్తోంది. వీరందరూ విమానాశ్రయాల్లో దిగిన ఫొటోలను ఇప్పుడు టీడీపీ నేతలే ప్రచారం చేస్తున్నారు. అంతేకాకుండా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది.

అధిష్టానానికి ఫిర్యాదుల పరంపర

చినబాబుతో తనకు మాత్రమే సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ అధికారం చెలాయిస్తున్న సదరు నేతపై టీడీపీ నేతలే గుర్రుగా ఉన్నారు. వివిధ ప్రజాప్రతినిధులకు కూడా విలువ లేకుండా.. మాట చెల్లుబాటు చేసుకుంటుండంపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అంతేకాకుండా నియోజకవర్గాలతో సంబంధం లేకుండా అన్నింటిలోనూ తలదూర్చుతుండటం కూడా ఆ పార్టీ నేతలకు నచ్చడం లేదు. ఈ నేపథ్యంలోనూ ఇప్పుడు ఈ నకిలీ ఏసీబీ సీఐ వ్యవహారంలో సదరు చైర్మన్‌పై పలువురు నేతలు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. నేరుగా టీడీపీ అధిష్టానం దృష్టికి ఇద్దరూ చనువుగా ఉన్న ఫొటోలను పంపి మరీ బాగోతాన్ని వెలికితీయాలని కోరినట్టు ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు. ఇక సదరు సంస్థలో కూడా ఇష్టారీతిలో ప్రవర్తిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టులను కేటాయిస్తూ దండుకుంటున్న విషయాన్ని కూడా ఈ ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. మొత్తంగా నకిలీ ఏసీబీ సీఐ వ్యవహారంలో మరింత లోతుగా దర్యాప్తు చేస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

‘ఉపాధి’ బకాయిలు చెల్లించండి మహాప్రభో.!


లోసింగిలో ఖాళీ క్యారేజీలతో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు, గోవిందరావు

రోలుగుంట: ఉపాధి వేతన బకాయిలు తక్షణం చెల్లించాలంటూ మండలంలోని అర్ల గిరిజన పంచాయతీ శివారు లోసింగి, పనసలపాడు గ్రామాల్లో కూలీలు బుధవారం ఖాళీ క్యారేజీలతో వినూత్న నిరసన తెలిపారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోవిందరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం అమలు అస్తవ్యస్తంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల శ్రామిక కుటుంబాలకు రూ.8,500 కోట్ల మేర బకాయిలున్నాయన్నారు. దీంతో పేదలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఈ పథకం కింద పని చేసే దాదాపు 15 వేల మంది సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందలేదన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని వేసవి సమయంలో ఉపాధి పథకం పనులపై ఆధారపడిన పేదల పరిస్థితి దయనీయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పథకం నిబంధనల మేరకు జరిగిన పనులకు 15 రోజుల్లోపు చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో పీడీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

అనకాపల్లిలో ఆపరేషన్ కగార్‌పై 2న సదస్సు


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు, తదితరులు

కె.కోటపాడు : సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో అనకాపల్లిలోని రోటరీ హాల్‌లో వచ్చేనెల 2న ఆపరేషన్ కగార్‌పై సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. ఈ మేరకు కె.కోటపాడులో బుధవారం సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో నెత్తుటి ఏరులు పారిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆపరేషన్ పేరిట మావోయిస్టులను ఏరివేసి, అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే లక్ష్యంగా కనిపిస్తుందన్నారు. 2005లో సల్వాజుడుం, 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో నరమేధంను సృష్టించి.. దానికి కొనసాగింపుగా ఆపరేషన్ కగార్‌ను తీసుకొచ్చారని ఆయన విమర్శించారు. ఏపీతో పాటు ఐదు రాష్ట్రాల్లో 28 రకాలైన విలువైన ఖనిజాలు విస్తరించి ఉన్నాయని, ఈ సంపదను దోచుకోవడానికి కార్పొరేట్ శక్తులు ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కేవలం వాటి కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత చేపట్టారన్న వాదన బలంగా ఉందన్నారు. ఈ సదస్సుకు మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలని దొరబాబు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్లె దేముడుబాబు, వేచలపు కాసుబాబు, వేమల కన్నబాబు, శరగడం పరమేష్, పొంతపల్లి రామారావు, రెడ్డి అప్పలనాయుడు, వియ్యపు రాజు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి 12 మందికి గాయాలు


కశింకోట–పెదపాడు రోడ్డులో బోల్తా పడిన ఆటో


అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కశింకోట: కశింకోట–పెదపాడు రోడ్డులో బుధవారం ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 12 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. టి.అర్జాపురం నుంచి అచ్యుతాపురానికి కూలీలను తీసుకెళ్తున్న ఆటో అదుపు తప్పి పక్కనున్న కాలువలోకి దూసుకుపోయి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 12 మంది గాయపడ్డారు. వారిని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడి చికిత్స అందించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. సీఐ అల్లు స్వామినాయుడు అనకాపల్లి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

దంచికొట్టిన వాన

- మునిగిన వడ్డాది డైవర్షన్ రోడ్డు
- ఖరీఫ్ సీజన్ రాకముందే విస్తారంగా వర్షాలు


వడ్డాది వంతనపై చేరిన వరద నీటిలో నుంచి వెళ్తున్న వాహనాలు


మాడుగుల వద్ద తాచేరు నదిలో వరద నీటి ప్రవాహం

బుచ్చెయ్యపేట: కొద్ది రోజులుగా వరుణుడు దంచి కొడుతున్నాడు. ఖరీఫ్ సీజన్ రాక ముందే విస్తారంగా వర్షాలు పడుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు వర్షం పడింది. సుమారు ఐదు సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. మేజర్ పంచాయతీ వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు మీద నుంచి వరద నీరు పొంగి ప్రవహించింది. దీంతో భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. చోడవరం, నర్సీపట్నం, పాడేరు, విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు గతంలో కూలిన శిథిల వంతెన పైనుంచి రాకపోకలు సాగించారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు హెచ్చరికలు చేశారు. ఆర్టీ రోడ్డు, బీఎన్ రోడ్డు, కేబీ రోడ్లతో పాటు పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో, పంట పొలాల్లో వరద నీరు చేరింది. వేసవి ఉక్కపోత, వడగాల్పుల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. పలు గ్రామాల్లో నువ్వు, కూరగాయలు, తదితర పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

తాచేరు, శారదా నదులకు జలకళ

మాడుగుల రూరల్: వర్షాలకు తాచేరు, పెద్దేరు, శారదా నదులకు జలకళ వచ్చింది. మంగళవారం రాత్రితో పాటు బుధవారం కూడా కురిసిన వర్షాలకు చెరువులు, కాలువల్లో నీరు చేరింది. జలాశయాల్లోకి కూడా నీరు వచ్చి చేరుతోంది. మరోవైపు శిథిలమైన రహదారుల్లోని గుంతల్లో వర్షపు నీరు చేరడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


బుచ్చెయ్యపేటలో బీఎన్ రోడ్డు గుంతల్లో నిలిచిన వర్షపు నీరు


వర్షపు నీటితో ఉన్న పెద్దేరు జలాశయం

పెద్దేరు నుంచి 540 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్: గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దేరు జలాశయంలో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరింది. తాజా వర్షాలకు జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 135.85 మీటర్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా.. వర్షాలకు జలాశయంలో 451 క్యూసెక్కుల నీరు చేరిందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పెరుగుతున్న నీటిమట్టంను దృష్టిలో ఉంచుకుని స్పిల్‌వే గేట్లు ద్వారా 540 క్యూసెక్కుల నీటిని బుధవారం రాత్రికి దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో జలాశయం నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. జలాశయం పరిసరాల్లో 60 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు.

సినిమా థియేటర్ల ఆకస్మిక తనిఖీ


పీవీఆర్ కాంప్లెక్స్‌లో నిర్వాహకులను ప్రశ్నిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నర్సీపట్నంలో సినిమా థియేటర్లను ఆర్డీవో వి.వి.రమణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా పీవీఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు థియేటర్లతో పాటు రాజు, బంగార్రాజు థియేటర్లను ఆయన తహసీల్దార్ రామారావుతో కలిసి పరిశీలించారు. టాయిలెట్లు, ఫైర్ సేఫ్టీ సౌకర్యాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రధానంగా క్యాంటీన్‌లో ధరలను అడిగి తెలుసుకున్నారు. ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. నిబంధనల మేరకు థియేటర్లలో సౌకర్యాలు ఉన్నదీ? లేనిదీ? చూశామన్నారు. తమ పరిశీలనలో గుర్తించిన అంశాల ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆర్డీవో తెలిపారు. ఎమ్మార్పీకి మించి తినుబండారాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి తరలింపుపై పోలీసుల దాడి

- ముగ్గురు నిందితుల అరెస్ట్, ఒకరు పరారీ
- 20 కిలోల గంజాయి స్వాధీనం, కారు సీజ్


గంజాయితో పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

రోలుగుంట: కారులో గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో కొత్తకోట సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామకృష్ణారావు, సిబ్బంది బుధవారం దాడి చేశారు. కొంతలం కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. పోలీసులను చూసి కారుతో పరారయ్యేందుకు ముగ్గురు ప్రయత్నించారు. వెంటనే స్పందించిన పోలీసులు దాడి చేసి, కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేశారు. గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని అంచానా. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒకరు పరారైనట్టు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన వారిలో అన్నవరం జిల్లా, మదనపల్లి మండలం, సప్పాతోట గ్రామానికి చెందిన పట్నం సురేష్(28), ఇదే మండలం, బి.కొత్తకోట గ్రామానికి చెందిన బంటుపల్లి కల్యాణ్(27), కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా కిల్‌కోట అంతరంగ రోడ్డుకు చెందిన వి.గౌతమ్(38) ఉన్నారన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండుకు తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

సబ్ జైల్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి


జైలును పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: సబ్‌జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ బుధవారం సందర్శించారు. ఖైదీలకు వండి పెట్టే నిత్యావసర సరకులను పరిశీలించారు. జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రిమాండ్‌లో ఏయే కేసుల్లో ఉన్నారని ఆరా తీశారు. మండల లీగల్ సర్వీస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చనని ఖైదీలకు సూచించారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారు జైల్ అధికారిని సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా అధికారులు

తుమ్మపాల/అనకాపల్లి: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ కలెక్టరేట్‌లో బుధవారం ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, సంక్షేమ పథకాల సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. డీఆర్వో వై.సత్యనారాయణ రావు, ఎస్‌డీసీలు సుబ్బలక్ష్మి, కె.మనోరమ, జిల్లా గణాంకాధికారి జి.రామారావు, డీఎస్‌వో కె.ఎల్.ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

31న పింఛన్ల పంపిణీ

తుమ్మపాల: ప్రభుత్వం అందించే నెలవారీ సామాజిక పింఛన్లను ఈసారి ఒకరోజు ముందుగా ఈ నెల 31నే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 1 ఆదివారం సెలవు దినం కావడంతో ఈ నెల 31న పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అధికారుల ఆదేశాలతో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ నెల 30 నాటికి బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు.

ఉపాధి కల్పించకుంటే మా గతేంటి?


అడ్మిన్ లోపలికి వెళ్తున్న కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

- స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల ఆవేదన
- కొనసాగిన అడ్మిన్ ముట్టడి.. స్వల్ప ఉద్రిక్తత


ఉక్కు అడ్మిన్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం(విశాఖ): ఉపాధి లేక ఆకలితో అలమటిస్తున్నామని, ఉపాధి కల్పించకపోతే తమ కుటుంబాల గతేంటని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండవ రోజు బుధవారం జరిగిన ఉక్కు అడ్మిన్ ముట్టడి కార్యక్రమంలో అధికారులు, పోలీసుల వద్దకు వెళ్లి కాంట్రాక్ట్ కార్మికులు తమ గోడు వెల్లబోసుకున్నారు. అనుకున్న ప్రణాళిక ప్రకారం గేట్లు దిగ్బంధానికి కార్మికులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అడ్మిన్ భవనం వద్దకు చేరుకున్నారు. ఒకేసారి బిల్డింగ్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కాస్త తోపులాట నెలకొంది. పోలీసులు పదే పదే చెప్పినప్పటికీ కార్మికులు పోలీసు వలయాన్ని దాటి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొంత మంది కింద పడిపోయారు. దీంతో యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇంత కాలం పనిచేసిన తమను తీసేస్తే తమ కుటుంబాల గతేంటని ప్రశ్నించారు. సాయంత్రం వరకు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గురు, శుక్రవారాలు కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. శుక్రవారం రీజనల్ లేబర్ కమిషన్ చర్యల అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ముట్టడిలో పాల్గొన్న నాయకులపై కేసు నమోదు

ఉక్కు అడ్మిన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులపై స్టీల్‌ప్లాంట్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. స్టీల్‌ప్లాంట్ రాజభాష విభాగం జీఎం లలన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసు వివరాలిలా ఉన్నవి. ఈనెల 20 నుంచి జరుగుతున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో 27, 28 తేదీల్లో కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి చేపట్టాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కార్పొరేటర్ గంగారావు, సత్యనారాయణ, కె.ఎం.శ్రీనివాస్, సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్యదర్శి నమ్మి రమణ, జి.శ్రీనివాస్, ఆర్.టి.రాజుతో పాటు సుమారు 200 కాంట్రాక్ట్ కార్మికులు ధర్నాలు చేసి రాకపోకలు సాగించే ఉద్యోగులకు ఇబ్బందులు కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మీ సేవలు చాలు.. వెళ్లిపోండి!

- ఏయూలో ప్రొఫెసర్ల కొరత వేళ.. ఎయిడెడ్ అధ్యాపకులకు ఉద్వాసన
- వీసీకి కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ లేఖ
- విద్యార్థుల చదువులపై ప్రభావం

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో ఫారిన్ సర్వీసుపై పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులందరినీ తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేయాలని కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భరత్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు బుధవారం వర్సిటీకి చేరాయి. దీంతో రాష్ట్రంలోని వేర్వేరు ఎయిడెడ్ కాలేజీల నుంచి ఆంధ్ర యూనివర్సిటీకి వచ్చిన వారంతా నేడో రేపో ఇక్కడ నుంచి రిలీవ్ కానున్నారు. ఏయూలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో 2023 జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ కాలేజీల నుంచి ఫారిన్ సర్వీసు/డిప్యూటేషన్ కింద 80 మంది అధ్యాపకులను తీసుకున్నారు. వర్సిటీ పాలక మండలి ఆమోదంతో జరిగినందున ఉన్నత విద్యామండలి అధికారులు ఇందుకు అనుమతించారు. తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో 40 మంది వెంటనే వెనక్కి వెళ్లిపోయారు. ఒకరు మృతి చెందగా, మరొకరు ఇటీవలే మాతృస్థానానికి వెళ్లారు. ప్రస్తుతం 38 మంది ఏయూలో పనిచేస్తున్నారు.



వీసీ కీలక నిర్ణయం

ఆంధ్ర యూనివర్సిటీకి ఆర్థిక భారమవుతున్న వారిని పంపించేయాల్సిందే అని వర్సిటీలోని కొంతమంది కొంతకాలంగా పట్టుబడుతున్నారు. ప్రస్తుత వీసీ ఆచార్య రాజశేఖర్ ఇటీవల క్యాంపస్ కాలేజీల డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఎయిడెడ్ అధ్యాపకుల విషయంలో వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారిని పంపించేయాల్సిందేనని మెజార్టీ విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో వీసీ కీలక నిర్ణయం తీసుకున్నారు. వారిని వర్సిటీ నుంచి రిలీవ్ చేస్తామని ఈ నెల 19న కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో ఎయిడెడ్ అధ్యాపకులంతా తదుపరి పోస్టింగ్ కోసమని కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆచార్యుల కొరత తీరేదెలా.?

ఏయూలో రెగ్యులర్ ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉంది. వెయ్యి మందికి పైగా అధ్యాపకులు ఉండాల్సిన ఏయూలో ప్రస్తుతం రెండు వందల్లోపే రెగ్యులర్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. దీంతో ఎయిడెడ్, కాంట్రాక్టు, అతిథి అధ్యాపకులే బోధనలో కీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం 38 ఎయిడెడ్ అధ్యాపకులు రిలీవ్ చేస్తే.. ఆ స్థానాలను వేరే మార్గాల్లో భర్తీ చేయాలి. 2025–26 విద్యా సంవత్సరానికి సిద్ధమవుతున్న సమయంలో ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు వీసీ దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

31 నాటికి రిలీవ్ చేస్తాం

ఏయూలో పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులను వెంటనే పంపించాలని కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఎయిడెడ్ అధ్యాపకులను ఏయూలో కొనసాగించుకుంటారా? లేదా అని ఇటీవల డైరెక్టర్ నుంచి లేఖ వచ్చింది. దీనిపై తమ పరిధిలో నిర్ణయం తీసుకుని వారిని పంపించేస్తామని నివేదించాం. ఈ నెల 31న నాటికి ఎయిడెడ్ అధ్యాపకులందరినీ ఇక్కడ నుంచి రిలీవ్ చేస్తాం.

– ఆచార్య ధనుంజయరావు, రిజిస్ట్రార్

30న జాబ్‌మేళా

సీతంపేట(విశాఖ): కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో భర్తీ చేసే ఆర్‌టీఏ/ఫార్మసిస్ట్ 30 పోస్టులకు టెన్త్/ఇంటర్/ఏదైనా డిగ్రీ/డిప్లమో/డీఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులు. 18 నుంచి 32 ఏళ్ల వయసు ఉండాలి. శ్రీరామ్ చిట్స్‌లో 30 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం ఏదైనా డిగ్రీ/ఎంబీఏ ఉత్తీర్ణులు అర్హులు. 25 నుంచి 40 ఏళ్ల వయసు ఉండాలి. ఎస్‌బీఐ కార్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్స్ 50 పోస్టుల కోసం ఇంటర్ ఆపై విద్యార్హత కలిగి, 18 నుంచి 32 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులు. డీమార్ట్‌లో 60 పేకర్, క్యాషియర్ పోస్టులకు టెన్త్, ఆపై విద్యార్హత ఉన్న వారు అర్హులు. 18 నుంచి 25 ఏళ్ల వయసు ఉండాలి. జాబ్ డీలర్స్ సంస్థలో టెలీకాలర్స్, ఎలక్ట్రీషయన్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రికవరీ ఏజెంట్స్ 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం టెన్త్/ఇంటర్, ఐటీఐ/డిప్లమో పూర్తి చేసి 18 నుంచి 32 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులు. టాటా విస్ట్రాన్ సంస్థలో అసెంబ్లీ ఆపరేటర్ 40 ఖాళీలకు టెన్త్/ఇంటర్/ఐటీఐ/డిప్లమో విద్యార్హతతో, 18 నుంచి 27 ఏళ్ల వయసు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https:/employment.ap.gov.in, www.ncs.gov.inలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సుబ్బిరెడ్డి సూచించారు.

గ్రోయిన్లకు మరమ్మతులు లేనట్టే?

- ప్రతిపాదనలు పంపినా నేటికీ స్పందించని ప్రభుత్వం
- శారదా నదిలో పెరిగిన నీటి ఉధృతి
- నిధులు మంజూరు చేసినా పనులకు ఆటంకం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


పెదపాడు కాలువ నుంచి నీటి ప్రవాహం


కాశీమదుం గ్రోయిన్‌పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


ఉగ్గినపాలెం గ్రోయిన్ గండి నుంచి వృథాగా పోతున్న నీరు


కాశీమదుం గ్రోయిన్ గ్రోయిన్ దిగువకు నీటి ప్రవాహం

కశింకోట: ముందు వేసవి లోనూ శారదా నదిలో భారీగా వరద నీరు చేరడంతో గ్రోయిన్ల మరమ్మతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. బుధవారం నదిలో భారీగా నీరు ప్రవహించింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలం పరిధిలో శారదానదిలో గల నాలుగు గ్రోయిన్లు శిథిలావస్థకు చేరడంతో సాగునీరు వృథాగా పోతోంది. దీంతో పంటలకు నీరు లేక రైతులు నష్టపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వీటి మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. సాధారణంగా నదిలో నీరు తక్కువగా ఉన్న వేసవి కాలంలో మరమ్మతులు చేస్తారు. అయితే సకాలంలో ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయకపోవడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాల వల్ల నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఈ ఏడాది గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టే అవకాశం ఉండదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో శారదా నదిపై ఉగ్గినపాలెం గ్రోయిన్ కింద 500 ఎకరాలు, కాశీమదుం గ్రోయిన్ కింద 940 ఎకరాలు, వెదురుపర్తి గ్రోయిన్ కింద 750 ఎకరాలు, పేరంటాల పాలెం గ్రోయిన్ కింద 125 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నాలుగు గ్రోయిన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆయకట్టుకు అరకొరగా నీరందుతోంది. వీటికి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. కాశీమదుం గ్రోయిన్ మరమ్మతుకు రూ.43 లక్షలు, వెదురుపర్తి గ్రోయిన్‌కు రూ.73 లక్షలు, పేరంటాలపాలెం గ్రోయిన్ రూ.71 లక్షల అంచనా వ్యయంతో మరమ్మతలు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు.

ముందుగానే నీటి ప్రవాహం

సాధారణంగా శారదా నదిలోకి ఏటా జూన్ నెలాఖరు, జులైలో నీరు చేరుతుంది. ఈ ఏడాది ముందు వేసవిలో కూడా బంగాళాఖాతంలో అల్ప పీడనాలు, తుపాన్ల ప్రభావంతో వర్షాలు అడపా దడపా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగా మే నెలలోనే నది ఎగువ ప్రాంతం నుంచి వరద నీరువస్తోంది. స్థానిక కాశీమదుం గ్రోయిన్ మీదుగా నీరు ఉరకలు వేస్తూ దిగువకు ప్రవహిస్తోంది. అలాగే గ్రోయిన్ నుంచి ఉన్న కాలువల్లో పెదపాడు వైపు వెళ్లే సాగు నీటి కాలువలో నీటి ప్రవాహం ప్రారంభమైంది. ఇక కశింకోట వైపు పొలాలకు వెళ్లే కాలువలో ఇంకా నీటి ప్రవాహం ప్రారంభం కాలేదు.

ఉగ్గినపాలెం గ్రోయిన్‌పై సతమతం

ఉగ్గినపాలెం గ్రోయిన్‌కు పడిన రెండు గండ్లను పూడ్చడంతోపాటు గతంలో పూడ్చిన గండిని మరింత పటిష్టం చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. దీనికి రూ. కోటి వరకు ఖర్చు కానుందని తెలుస్తోంది. ఇంత మొత్తంలో నిధులు ఖర్చు చేసి నిర్మించినా అది రైతులకు ఉపయోగపడుతుందా? లేదా? అనేది తెలియని పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితిలో దీన్ని ఎలా పూర్తి చేయాలా? అని అధికారులు సతమతమవుతున్నారు. దీనికి సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదు. ఇక మిగిలిన కాశీమదుం, వెదురుపర్తి, పేరంటాలపాలెం గ్రోయిన్ల మరమ్మతులకు సుమారు రూ.1.90 కోట్లతో అంచనా వ్యయంతో నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈనేపథ్యంలో మరమ్మతులు చేపడితే సాగునీరందుతుందని రైతులు ఆశించారు. అయితే ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. ఈ ఏడాది అనూహ్యంగా వేసవిలోనే నదిలో వరద నీరు చేరింది. దీంతో ఇక ఈ ఏడాది కూడా మరమ్మతులు లేనట్టేనని, ఎప్పటిలాగే నష్టపోక తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

క్లుప్తంగా

సంపద తయారీ కేంద్రం పరిశీలన



మార్టూరు సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శిరీషారాణి

అనకాపల్లి: మండలంలోని మార్టూరులో గల చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని సుప్రీం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని జిల్లా పంచాయతీ రాజ్ అధికారిణి శిరీషారాణి తెలిపారు. బుధవారం మార్టూరు సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకూ మండలంలోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను పరిశీలించనున్నట్టు చెప్పారు. మండల పరిధిలో అన్ని పంచాయతీలు మార్టూరు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నరసింహమూర్తి, సర్పంచ్ కరణం వెంకట శివ రెవెన్యూ నాయుడు, ఎంపీటీసీ మిద్దె రాజ చంద్ర రావు, ఉప సర్పంచ్ బేత పెంటరావు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదమాంబ విగ్రహ ప్రతిష్ట


మోదమాంబ అమ్మవారు

తుమ్మపాల: మండలంలోని గొలగాం పంచాయతీ పాత తలారివానిపాలెంలో మోదమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు నారపిన్ని నానాజీ ఆర్థిక సాయంతో 108 పళ్లాలతో సారె ఊరేగింపు, మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మేళతాళాలు, కోలాటాలతో ఆలయం వద్ద ఉదయం నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పలు స్టేజ్ ప్రోగ్రాంలు జరిగాయి.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: మునగపాక మెయిన్‌రోడ్డులో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. హెచ్‌సీ ధనరాజ్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడంతో పాటు బైక్‌కు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్‌సీ హెచ్చరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 120 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,960	4,960
మొదటి రకం	4,320	4,850
రెండో రకం	3,800	4,500
మూడో రకం	3,700	3,700

అనకాపల్లి సినిమాలు

నిశ్శబ్ద ప్రేమ : రాజా
శుభం : సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 : శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 : పర్తిసాయి
సింగల్ : షిర్డీసాయి
ఏస్‌ఈ : వెంకటేశ్వర
వర్షం : శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-11 యూనిట్లు, బి పాజిటివ్-7 యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706) ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 299 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్యను 8 వేలకు పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. కశింకోటలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించి, ఉపాధి పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 5,600 మంది వరకు ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులను పూర్తి స్థాయిలో నిర్వహించి కూలీలకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు.

గ్రామాల్లో కాలువల పనులు చేపట్టాలని సూచించారు. పండ్ల తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతుల నుంచి ప్రతిపాదనలు తీసుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడే కంపోస్టు పిట్స్, ఫారం పాండ్స్ తవ్వించడానికి ఫీల్డు సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో కూలీలు రోజుకి ఏడు గంటల పాటు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో ఎం. శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలపై శిక్షణ


శిక్షణ పొందుతున్న సచివాలయ సిబ్బంది

కశింకోట: యోగాంధ్రలో భాగంగా స్థానిక సచివాలయ సిబ్బందికి రెండో రోజు బుధవారం వివిధ యోగాసనాలపై తర్ఫీదు ఇచ్చారు. సుమారు 187 మంది శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఎంఈవో కె.ఎస్.ఎన్.మూర్తి, ఆయుష్ ఆస్పత్రి వైద్యాధికారి అనూష, తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లలో తహసీల్దార్ తనిఖీలు


పాయకరావుపేటలో థియేటర్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పాయకరావుపేట: పట్టణంలోని మూడు సినిమా థియేటర్లలో తహసీల్దార్ గారా ఆనందరావు తనిఖీలు చేశారు. గౌతమ్, రామకృష్ణ చిత్రమందిర్, శ్రీలక్ష్మి (ఎస్‌వీఎస్) థియేటర్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి థియేటర్లు నిర్వహిస్తున్నారా? లేదా? అనే విషయాలపై తనిఖీ చేశామన్నారు. టికెట్ ధరలు, క్యాంటీన్లు, భద్రత చర్యలు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించినట్లు చెప్పారు. మూడు థియేటర్లు సక్రమంగానే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆక్రమణల చెరలో కాలువ గట్లు


ఆక్రమణకు గురవుతున్న భూమి కాలువ


ఆక్రమణకు గురవుతున్న తాండవ నది ఒడ్డు, లింగాల కాలనీ రోడ్డు

పాయకరావుపేట: కాలువ గట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. తమ సొంత స్థలాల్లా భావించి పలువురు అక్కడ నిర్మాణాలు, పశువుల పాకలు, షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కాలువ గట్ల ఆక్రమణతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. పాయకరావుపేట పట్టణ పరిధిలోని తాండవ నది ఒడ్డున పలువురు అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. తాండవ చక్కెర కర్మాగారం నుంచి తాండవ నది పొడవునా నది గట్టు ఆక్రమణకు గురైంది. తాండవ నది ఒడ్డు ఉన్న నాగరాజుపేట మీదుగా రైల్వే గేటు ద్వారా లింగాల కాలనీ మీదుగా నర్సీపట్నం రోడ్డు సెంటర్‌కు వెళ్లే రోడ్డు మొత్తం కబ్జా పాలైంది. ఆర్‌అండ్‌బీకి సంబంధించిన ఈ రోడ్డు కొంత భాగం తుని పరిధిలో ఉండడం, మరి కొంత భాగం పాయకరావుపేట మండల పరిధిలో ఉండడంతో ఇరు పట్టణాలకు చెందిన అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పాయకరావుపేట పట్టణం నుంచి నిత్యం నర్సీపట్నం వెళ్లే ప్రయాణికులకు ఇదే దగ్గర మార్గం కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. తాండవ నది ఒడ్డును ఆక్రమించుకుని షెడ్లు, షాపులు, బడ్డీలు ఏర్పాటు చేయడంతో రోడ్డు కుచించుకుపోతోంది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతులకు పంట పొలాలకు సాగునీరు సరఫరా చేసే భూమి కాలువ కూడా ఆక్రమణలకు గురవుతోంది. తాండవ చక్కెర కర్మాగారం సమీపాన ఉన్న తాండవ నదిపై నిర్మించిన భూమి ఆనకట్ట నుంచి ఈ కాలువ ప్రారంభమై పొలాలకు సాగునీరు సరఫరా చేస్తుంది. పాయకరావుపేట, అరట్లకోట, నామవరం, గుంటపల్లి, ఉద్దండపురం తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. కానీ ఈ భూమి కాలువ గట్లు ఇరువైపులా ఆక్రమించుకుని పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాండవ నది గట్టు, భూమి కాలువ ఆక్రమణలకు గురవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు వాపోతున్నారు.

వర్షాలకు అధ్వానంగా రోడ్లు


బురదమయంగా మారిన పోలవరం కాలువ అప్రోచ్ రోడ్డు

ఎస్.రాయవరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దార్లపూడి శివారు పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్డు వద్ద డైవర్షన్ సక్రమంగా వేయకపోవడంతో కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. రద్దీగా ఉండే ఈ రోడ్డు క్రాసింగ్ పనులు చేసేటప్పుడు కాంట్రాక్టర్ నిర్వాకం వల్ల ద్విచక్ర వాహనాదారులు అవస్థలు పడ్డారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కాగా ఉపాధి హామీ పనులు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ఉపాధి హామీ పథకం పనులు మరింత పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తామన్న ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వాలని సూచించారు. పని వేళలు మరింత పెంచి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. పంట సంజీవిని(నీటి గుంటల)పై మరింత దృష్టి సారించాలన్నారు. ఈ సంజీవిని ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏపీవో శివ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంపై పునరాలోచించాలి


దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేస్తున్న దేవరాపల్లి మండల వీఆర్‌వోలు

దేవరాపల్లి : గ్రామ రెవెన్యూ అధికారులను క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు ఒక వీఆర్‌వోను నియమిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 4పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని దేవరాపల్లి మండల వీఆర్‌వోల యూనియన్ నాయకులు కోరారు.


ఈమేరకు తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి మండల వీఆర్‌వోల యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. క్లస్టర్ విధానంతో మరింత పని ఒత్తిడిలోనై తీవ్ర అనారోగాల బారిన పడే ప్రమాదం ఉందని, గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన ఈ జీవో నుంచి వీఆర్‌వోలను మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వోల యూనియన్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ జగదీష్, కాసప్ప, దొర, రమణమ్మ పాల్గొన్నారు.

పాడిరైతులకు పావలా వడ్డీకే రుణాలు


వెటర్నరీ ఏరియా ఆస్పత్రి ఏడీ డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం : పాడి రైతులకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు పశుసంవర్ధకశాఖ నిర్ణయం తీసుకుందని నర్సీపట్నం వెటర్నరీ ఏరియా ఆస్పత్రి ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. రైతులకు లాభసాటిగా ఉన్న పాడిని అభివృద్ధి చేయడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఒక పశువు కలిగి ఉన్న రైతు మరో పశువును కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. మెప్మా, వెలుగు ద్వారా పావలా వడ్డీకి రుణాలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లోని 87 మంది రైతులను గుర్తించామని, వీరందరికీ త్వరలోనే పావలా వడ్డీ రుణాలు అందజేస్తామన్నారు. వడ్డీ భారం లేనందున పాడిని అభివృద్ధి చేసుకుని తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం ద్వారా మరలా తిరిగి రుణం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

వరాహ నదికి జలకళ


వరాహనదిలోకి చేరుతున్న వర్షం నీరు

కోటవురట్ల: వరాహ నదికి జలకళ వచ్చింది. చాలా కాలంగా ఎండిపోయి చుక్కనీరు లేకుండా ఉన్న వరాహ నదిలోకి ప్రస్తుత వర్షాలతో నీరు చేరుతోంది. ఎగువ ఏజెన్సీ ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరాహ నదిలోకి వరద నీరు చేరుతోంది. పాతరోడ్డు సమీపంలో వరాహ నదిలోకి సర్పా నది కూడా కలవడంతో ప్రవాహం పెరుగుతోంది. రెండు నదుల సంగమంతో పందూరు వద్ద ప్రవాహం రానురాను పెరుగుతోంది.

విద్యార్థులకు సైకిల్ పోటీలు

నక్కపల్లి: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. 20 రోజుల నుంచి గ్రంథాలయంలో పుస్తక పఠనం, పద్య పఠనం, వ్యాసరచన, చిత్ర లేఖనం, నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లిష్, వంటి పోటీలు చేపట్టారు. ఆటపాటల్లో భాగంగా సైక్లింగ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయాధికారి జనార్దన్ తెలిపారు.

యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కన్నాజీ


అనకాపల్లి పట్టణ యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

అనకాపల్లి: అనకాపల్లి పట్టణ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కారుకొండ కన్నాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నర్సింగరావుపేటలో గల జిల్లా యాదవసంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా కోన ఉమ, గౌరవాధ్యక్షుడిగా పాత్రపల్లి కనక అప్పలరాజు, అనకాపల్లి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా భర్నికాన రమణబాబు, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శిగా నేమాల రమేష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘం జిల్లా అధ్యక్షుడు భర్నికాన బాబూరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు కరక సోమునాయుడు, ఒమ్మి రాము, జిల్లా సహాయకార్యదర్శి కుండల రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు భర్నికాన నరసింహమూర్తి, అనకాపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు పంచదార్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. తెలుగు భాష, వాక్య నిర్మాణం గురించి నరసింగబిల్లి పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కశింకోటకు సత్యసాయి రథం


తాళ్లపాలెంలో సాయిబాబా ప్రేమ రథాన్ని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న సత్యసాయి ప్రేమ రథం యాత్ర బుధవారం కశింకోటకు చేరింది. మండలంలోని కన్నూరుపాలెం, తాళ్లపాలెం మీదుగా రథ యాత్ర సాగింది. ఈ సందర్భంగా భక్తులు సాయి రథాన్ని దర్శించుకున్నారు. తాళ్లపాలెంలో సాయి సమితి నిర్వాహకులు ముక్కామల వెంకటరావు తదితరులు స్వాగతం పలికారు.

బోర్లకు మరమ్మతులు


కశింకోట గవరపేటలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలో పాడైన బోర్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహిస్తున్నారు. సుమారు 35 బోర్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. కశింకోటలో 20 బోర్లు ఉండగా, వాటిలో పది వరకు బోర్ల మరమ్మతులు చేశారు. మిగిలిన బోర్లకు రెండు రోజుల్లో మరమ్మతులు చేయనున్నట్టు సిబ్బంది తెలిపారు.

ఇనుప వ్యర్థాల బహిరంగ వేలానికి నిర్ణయం

మాడుగుల : స్థానిక మండల పరిషత్‌కు సంబంధించిన ఇనుప వ్యర్థాలు బహిరంగ వేలం వేయాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు ఆరు టన్నుల పాతబోరు విడిభాగాలు, ఇతర ఎనిమిది రకాల ఇనుప వ్యర్థాలను వేలం వేయాలని నిర్ణయించారు.